'దుమ్ము' లేస్తుంది

బేల, మార్చి 14: ఆదిలాబాద్ జిల్లా బేల మండలంలోని భోరజ్ నుంచి మహారాష్ట్ర సరిహద్దు ఉపాసనాల వరకు రెండు వరుసల రోడ్డు నిర్మాణ పనుల్లో భాగంగా కాంట్రాక్టర్ రోడ్డుపై నీళ్లు చల్లకపోవడంతో విపరీతమైన దుమ్ము లేస్తుంది. దీంతో స్థానికులు, వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. భారీ వాహనాల రాకపోకలతో వెలువడుతున్న దుమ్ము ధూళితో ప్రయాణికులు, ప్రజలు దగ్గు దుమ్ముతో శ్వాసకోశ సమస్యతో బాధపడుతున్నారు. ద్విచక్ర వాహనదారులు పెద్ద వాహనాలు వచ్చే సమయంలో వెళ్లాలంటే జంకుతున్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు రోడ్డు పనులు నాణ్యత పాటించే విధంగా చూసి దుమ్ము లేవకుండా నీళ్లు చల్లించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

రోడ్డుపై వాహనాల రాక పోకలతో వెలువడుతున్న దుమ్ముధూళి

బ్రిడ్జి నిర్మించండి సారూ..

ధ్వంసమైన వాడి-కోతుల్‌గాం బ్రిడ్జి

నిర్మల్ జిల్లా భైంసా మండలంలోని వాడి నుంచి కోతుల్‌గాం వెళ్లే మార్గంలో సుద్దవాగుపై నిర్మించిన బ్రిడ్జి రెండు సంవత్సరాల క్రితం భారీ వర్షాలకు ధ్వంసమైంది. కోతుల్‌గాం జీపీకి అనుబంధ గ్రామమైన వాడికి బ్రిడ్జి సౌకర్యం ఉంటే కేవలం ఒక కిలోమీటర్ దూరం మాత్రమే ఉంది. కానీ బ్రిడ్జి ధ్వంసం అయ్యాక వాడి గ్రామస్తులు వివిధ పనుల నిమిత్తం కోతుల్‌గాం జీపీకి చేరుకోవాలంటే కనీసం 15 కిలోమీటర్ల అదనపు ప్రయాణం చేయాల్సి వస్తున్నది. ఇరువైపుల రాకపోకలు సాగించాలంటే ఇబ్బందులు పడుతున్నామని, అధికారులు స్పందించి బ్రిడ్జి నిర్మాణానికి చర్యలు చేపట్టాలని ఇరు గ్రామాల ప్రజలు కోరుతున్నారు. - భైంసాటౌన్, మార్చి 14

నిర్మల్‌లోని ఆఫీసర్స్ క్లబ్ కాంప్లెక్స్ ఎదుట ధ్వంసమైన ఫుట్‌పాత్

ఇలాగైతే నడిచేదెలా?

జిల్లా కేంద్రమైన నిర్మల్ పట్టణానికి స్థానిక ప్రజలతో పాటు గ్రామాలు, ఇతర జిల్లాల నుంచి వచ్చే వారితో నిత్యం రద్దీగా ఉంటుంది. ట్రాఫిక్ అధికంగా ఉన్నప్పుడు పాదాచారులు నడవడానికే ఇబ్బందిగా మారింది. ముందుచూపుతో మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో రూ. లక్షలు వెచ్చించి ఫుట్‌పాత్‌లు నిర్మించిన ప్రయోజనం లేకుండా పోయింది. వాటిని వ్యాపారాలకు, పార్కింగ్ కోసం ఉపయోగిస్తుండడంతో పాదాచారులకు నడవడానికి దారి లేకుండా పోయింది. పలుచోట్ల ఫుట్‌పాత్‌లు ధ్వంసం చేయడంతో రెయిలింగ్ కనిపించకుండా పోయింది. మున్సిపల్ అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు. -నిర్మల్ ఫొటోగ్రాఫర్, మార్చి 14

నిర్మల్‌లోని ఓల్డ్ బస్టాండ్ మార్కెట్ వెళ్లే దారిలో ఫుట్‌పాత్‌ను ఆక్రమించి నిర్వహిస్తున్న వ్యాపారం

కుంటాల ఎస్ఐ బదిలీ

కుంటాల, మార్చి 14 : నిర్మల్ జిల్లా కుంటాల పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐగా పని చేస్తున్న భాస్కరాచారిని బాసర పీఎస్‌కు బదిలీ చేస్తున్నట్లు గురువారం ఎస్పీ ఉత్తర్వులు జారీ చేశారు. కుంటాల పీఎస్‌కు కొత్త ఎస్ఐ పేరు ప్రకటించాల్సి ఉంది.

కప్పర్ల ప్రాథమిక పాఠశాల ఏఐకి ఎంపిక

తాంసి, మార్చి 14: ఆదిలాబాద్ జిల్లా తాంసి మండలంలోని కప్పర్ల ప్రాథమిక పాఠశాల ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) కార్యక్రమంలో భాగంగా ఎంపికైనట్లు మండల విద్యాశాఖ అధికారి శ్రీకాంత్ తెలిపారు. ఈ ఎంపిక ద్వారా పాఠశాల విద్యార్థులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, కంప్యూటర్ విజ్ఞానం, భవిష్యత్‌లో అవసరమైన నైపుణ్యాలను అభివృద్ధి చేసుకునే విద్యార్థులకు చిన్న వయసులో అవగాహన కల్పిస్తారు. కప్పర్ల ప్రైమరీ పాఠశాల ఏఐ పాఠశాలగా ఎంపిక కావడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

ఘనంగా ల్యాబ్ టెక్నీషియన్ డే

నిర్మల్ చైన్‌గేట్, మార్చి 14 : అంతర్జాతీయ ల్యాబ్ టెక్నీషియన్ డేను నిర్మల్‌లో ల్యాబ్ టెక్నీషియన్లు గురువారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా ఐఎంఏ నిర్మల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ మురళీధర్ ల్యాబ్ టెక్నీషియన్లను సన్మానించారు. కార్యక్రమంలో తెలంగాణ డయాగ్నొస్టిక్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేరెళ్ల హనుమంతు, జిల్లా అధ్యక్షుడు సంతోష్‌కుమార్, నిర్మల్ పట్టణ మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్, ల్యాబ్ టెక్నీషియన్లు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

భీంపూర్, మార్చి 14 : ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ మండలం నిపాని సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల పనుల కారణంగా నిపాని, అర్లి(టీ) సబ్‌స్టేషన్ల పరిధి గ్రామాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ శ్రావణ్‌కుమార్ తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

కంప్యూటర్ షాపులో అగ్నిప్రమాదం

ఎదులాపురం, మార్చి 14 : ఆదిలాబాద్‌లో శుక్రవారం ఓ కంప్యూటర్ దుకాణంలో షార్ట్ సర్క్యూట్ జరిగింది. లాలా చౌక్‌లోని నిజాం కంప్యూటర్ ఆన్‌లైన్ షాపులో షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. కంప్యూటర్లు, జిరాక్స్ యంత్రం తదితరాలు దగ్ధమయ్యాయి. దాదాపు రూ.1.50 లక్షల నష్టం జరిగినట్లు యజమాని మొహమ్మద్ నిజాముద్దీన్ తెలిపారు. అగ్ని ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే స్పందించి తాళాలు పగలగొట్టి మంటలను ఆర్పివేశారు.



ఇచ్చోడ: గ్రామ పంచాయతీ కార్మికులతో బీఆర్ఎస్ నాయకులు, మాజీ ఎంపీపీ ప్రీతమ్‌రెడ్డి

నిర్మల్ అర్బన్ : వీహెచ్‌పీ ఆధ్వర్యంలో..

హోలీ..ఆనందాల కేళి

జైనథ్/బేల/బోథ్/ఇచ్చోడ/నేరడిగొండ/భీంపూర్/తాంసి/తలమడుగు/ఉట్నూర్/ఇంద్రవెల్లి/నిర్మల్‌అర్బన్/నిర్మల్‌చైన్‌గేట్/సోన్/లక్ష్మణచాంద/భైంసా/ముథోల్/ఖానాపూర్‌టౌన్, మార్చి 14 : ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల్లో శుక్రవారం హోలీ వేడుకలు ఆనందోత్సాహాలతో ఘనంగా జరుపుకున్నారు. యువకులు, పిల్లలు, పెద్దలు, యువతులు, మహిళలు అందరూ పాల్గొన్నారు. పరస్పరం రంగులు చల్లుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ వేడుకలతో వీధులన్నీ రంగుల మయమయ్యాయి. సంప్రదాయ నృత్యాలు చేస్తూ సందడి చేశారు. పోలీసులు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేసి విస్తృతంగా పెట్రోలింగ్ నిర్వహించారు. మారుమూల ప్రాంతాల్లో ఆదివాసులు సంప్రదాయ నృత్యాలు చేస్తూ వేడుకలు జరుపుకున్నారు. రైతులు తమ పొలాలకు వెళ్లి ఆరాధ్య దేవతలకు గుడాలను నైవేద్యంగా సమర్పించారు. పొలం చుట్టూ గుడాలు చల్లుకున్నారు. ఎమ్మెల్యేలు, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, రాజకీయ నాయకులు వేడుకల్లో పాల్గొని ఉత్సాహపరిచారు.

నేరడిగొండ: హోలీ సంబరాల్లో పాల్గొన్న బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్

నిర్మల్ చైన్‌గేట్: నిర్మల్ ఏఎన్‌రెడ్డి కాలనీలోని ఏఎంఆర్ టవర్స్‌లో..

ఖానాపూర్ టౌన్: మిఠాయిలు తినిపించుకుంటున్న యువకులు

మాదిగలకు సీఎం రేవంత్‌రెడ్డి మోసం

- ఎస్సీ వర్గీకరణ అమలులో దగా చేశారంటూ
- ఎమ్మార్పీఎస్ నాయకుల అర్ధనగ్న ప్రదర్శన

ఎదులాపురం: అర్ధనగ్న ప్రదర్శన చేస్తూ నిరసన వ్యక్తం చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

ఎదులాపురం, మార్చి14: మాదిగలను మోసం చేయడంలో నంబర్ వన్ మోసగాడు సీఎం రేవంత్ రెడ్డి అని ఎమ్మార్పీఎస్ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు ఆరెల్లి మల్లేశ్ ఆరోపించారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట చేపట్టిన నిరహార దీక్షలో భాగంగా శుక్రవారం నాయకులు అర్ధనగ్న ప్రదర్శనతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఆరెల్లి మల్లేశ్ మాదిగ మాట్లాడుతూ రాజకీయంగా ఎదిగేందుకు మాదిగ జాతిని మోసం చేసిన మోసగాడు సీఎం రేవంత్ రెడ్డి అని ఆరోపించారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం ఇచ్చిన ప్రతి ఉద్యోగ నోటిఫికేషన్‌లో ఎస్సీ వర్గీకరణ అమలు చేసి న్యాయం చేస్తానని నిండు శాసనసభలో మాట ఇచ్చి మోసం చేశాడని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీని రాజకీయంగా భూస్థాపితం చేయడమే లక్ష్యంగా ముందుకెళ్తామన్నారు. ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలన్నారు. ప్రతి ఉద్యోగంలో మాదిగలకు రిజర్వేషన్ల వాటా కల్పించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో పట్టణ ఇన్‌చార్జి మడిపల్లి మనోజ్ మాదిగ, రూరల్ మండలం ఇన్‌చార్జి తరుడి శంకర్ మాదిగ, కడదరపు స్వామి, కొమ్ము కిరణ్, కొమ్ము అశోక్, చిట్టి రేంజర్ల రాజు, పోతరాజు శ్రీకాంత్, సాకిపల్లి దేవన్న, హన్మాండ్లు ఉన్నారు.

బోథ్, మార్చి 14: దేశ అత్యున్నత న్యాయస్థానం తీర్పును అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బోథ్ బస్టాండ్ ఎదుట ఎమ్మార్పీఎస్ నాయకులు చేపట్టిన నిరసన దీక్ష శుక్రవారం మూడో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు కుడాల స్వామి మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం ఎస్సీ వర్గీకరణ చట్టబద్ధం చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

బోథ్ : మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు కుడాల స్వామి

గ్రూప్-3 ఫలితాల్లో మనోళ్ల సత్తా

పవన్

అవినాశ్

ఎల్టీ కార్తీక్‌రెడ్డి

సారంగాపూర్, మార్చి 14: నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలంలోని మల్లక్‌చించోలి గ్రామానికి చెందిన దాసని రమణయ్య-లక్ష్మి దంపతుల కుమారుడు దాసరి పవన్ శుక్రవారం విడుదల చేసిన గ్రూప్-3 ఫలితాల్లో 667వ ర్యాంకు సాధించాడు. దాసరి పవన్ ఒకటి నుంచి పదో తరగతి వరకు లోలం పాఠశాలలో, ఇంటర్, డిగ్రీ హైదరాబాద్‌లో పూర్తి చేశాడు. హైదరాబాద్‌లో ఉండి ఎటువంటి కోచింగ్ లేకుండా గ్రూప్-3 పరీక్షకు ప్రిపేర్ అవుతూ వచ్చాడు. తాజాగా గ్రూప్-3 ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించాడు. అలాగే గ్రూప్-2లో 542వ ర్యాంక్ సాధించాడు. పవన్‌ను గ్రామస్తులు, వీడీసీ సభ్యులు అభినందించారు.

జైనథ్, మార్చి 14: ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలంలోని ఆడ గ్రామానికి చెందిన దుర్ల అశోక్ కుమారుడు అవినాశ్ శుక్రవారం విడుదలైన గ్రూపు-3 ఫలితాల్లో ఎంపిక య్యారు. తల్లిదండ్రులు వ్యవసాయం చేస్తుంటారు. ఆయన ఇటీవల విడుదలైన గ్రూపు-2 ఫలితాల్లో సైతం ఉద్యోగం సాధించాడు. జిల్లా కేంద్రంలోని ఎస్సీ స్టడీ సర్కిల్‌లో కోచింగ్ తీసుకున్నానని ఆయన తెలిపారు. ఉద్యోగం సాధించడంపై ఎస్సీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ డాక్టర్ రమేశ్ ఆయనను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

భీంపూర్, మార్చి14 : ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ మండలం కరంజి(టీ) గ్రామానికి చెందిన ఎల్టీ సుదర్శన్‌రెడ్డి- రాధ దంపతుల కుమారుడు ఎల్టీ కార్తీక్‌రెడ్డి గ్రూప్-3 ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో 287 మార్కులతో 326వ ర్యాంకు సాధించాడు. వీరిది వ్యవసాయ కుటుంబం. కార్తీక్‌రెడ్డి గ్రూప్-1లో 442. 5మార్కులు సాధించాడు. ఇతను ప్రాథమిక ఆదిలాబాద్ సీఆర్ఆర్ పాఠశాల, తర్వాత ఇంటర్మీడియట్ వరకు పిప్పర్‌వాడ అభ్యుదయ , డిగ్రీ , పీజీ హైదరాబాద్ నిజాం కళాశాలలో పూర్తి చేశాడు. కార్తీక్‌రెడ్డిని గ్రామస్తులు, ఉపాధ్యాయులు అభినందించారు.

పట్టు వీడని గ్రామస్తులు

- గుడి, రోడ్డు నిర్మాణానికి అనుమతులు ఇవ్వాలని డిమాండ్
- మూడో రోజు కేసీఆర్ హరితవనం ధ్వంసం

దస్తురాబాద్ : గ్రామస్తుల నుంచి వినతిపత్రం స్వీకరిస్తున్న అటవీ శాఖ అధికారులు

దస్తురాబాద్, మార్చి14 : నిర్మల్ జిల్లా దస్తురాబాద్ మండలంలోని దేవునిగూడెం గ్రామ ప్రజలు గుడి నిర్మాణానికి స్థలాన్ని కేటాయించాలని, రోడ్డు సౌకర్యాలకు అనుమతులు ఇవ్వాలని పట్టుబట్టిన విషయం తెలిసిందే. దేవునిగూడెం గ్రామ ప్రజలు మూడో శుక్రవారం గ్రామ శివారులోని కేసీఆర్ హరితవనాన్ని ధ్వంసం చేశారు. దాదాపు 150 చెట్లను నరికివేశారు. మూడు రోజుల్లో 500 చెట్లకు పైగా నరికివేశారు. ఈ విషయం తెలుసుకున్న అటవీ శాఖ, పోలీసు శాఖ అధికారులు ఘటనా స్థలానికి చేరుకొని వారిని అడ్డుకొని నచ్చజెప్పి వెనక్కి పంపారు. అనంతరం వారితో అటవీ శాఖ అధికారులు మంతనాలు జరిపారు. శనివారం ఉదయం 11 గంటల వరకు అనుమతులు ఇవ్వకపోతే మళ్లీ చెట్లు నరికివేస్తామని చెప్పారు. ఆఖరికి అటవీ భూమి ఉన్న నల్ల పోచమ్మ ఆలయ నిర్మాణానికి స్థలాన్ని కేటాయించాలని గ్రామస్తులు అటవీ శాఖ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఇక్కడ ఎఫ్ఆర్వో గీతారాణి, ఎస్ఐ అశోక్, ఎఫ్ఎస్‌వోలు, ఎఫ్‌బీవోలు ఉన్నారు.

కేసీఆర్ హరితవనంలో నరికిన చెట్లు

రక్తదానం చేసి.. ఆపరేషన్లు చేయించారు

ఇంద్రవెల్లి, మార్చి 14: ఆదిలాబాద్‌లోని రిమ్స్‌లో వివిధ రకాల వ్యాధులతో బాధపడుతున్న రోగులకు ఆపరేషన్లు చేసేందుకు రక్తం అవసరం ఉందని తెలుసుకున్న 108 అంబులెన్స్ పైలేట్ ఆత్రం అశోక్ తన వెంట ఐదుగురు యువకులను తీసుకొని రిమ్స్‌కు చేరుకొని రక్తదానం చేశారు. వివిధ రకాల వ్యాధులతో బాధపడుతున్న రోగులకు రక్తం ఇచ్చి ఆపరేషన్లు చేయించారు. దీంతో రిమ్స్‌లోని వైద్య సిబ్బంది వారిని అభినందించారు.

రక్తదానం చేసిన యువకులు

ఫకీర్‌పేట్ బీట్ ఆఫీసర్ సస్పెన్షన్

ఇచ్చోడ, మార్చి 14 : ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలంలోని సిరిచెల్మ కవ్వాల్ టైగర్ జోన్ పరిధిలో విధులు నిర్వర్తిస్తున్న బీట్ ఆఫీసర్ గేడం సుభాష్‌ను సస్పెన్షన్ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారని శుక్రవారం సిరిచెల్మ కవ్వాల్ టైగర్ జోన్ ఎఫ్ఆర్‌వో నాగస్వామి తెలిపారు. విధులు సక్రమంగా నిర్వర్తించకపోవడంతో ఫకీర్‌పేట్ పేట్ బీట్‌లో స్మగ్లర్లు 40 టేకు చెట్లను నరికివేసినట్లు తెలిపారు. వాటి విలువ రూ.3 లక్షల 38 వేల వరకు ఉంటుందని తెలిపారు. అటవీ శాఖాధికారులు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే శాఖపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

నేడు కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ

భీంపూర్, మార్చి 14: ఆదిలాబాద్ జిల్లా భీంపూర్‌లో శనివారం మధ్యాహ్నం 12.35 గంటలకు బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు అందజేస్తారని డిప్యూటీ తహసీల్దార్ హరీశ్ ఒక ప్రకటనలో తెలిపారు. సకాలంలో లబ్ధిదారులు హాజరుకావాలని ఆయన కోరారు.

డయల్ యువర్ డీఎం

భైంసా, మార్చి 14 : నిర్మల్ జిల్లా భైంసాలోని ఆర్టీసీ డిపోలో శనివారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ హరిప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రయాణికులు ఉదయం 11 నుంచి 12 గంటలకు 9959226005 నంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు. ఏవైనా సమస్యలున్నా ఈ నంబరుకు ఫోన్ చేసి తెలపగలరని పేర్కొన్నారు.

మల్లక్‌చించోలిలో కుస్తీ పోటీలు

కుస్తీలు పడుతున్న మల్లయోధులు

సారంగాపూర్, మార్చి 14: నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలంలోని మల్లక్‌చించోలి గ్రామంలో హోలీ పండుగను పుస్కరించుకుని గ్రామస్తులు కుస్తీ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో మహారాష్ట్ర, కుభీర్, శివిని, నాందేడ్ తదితర ప్రాంతాలతో పాటు చుట్టు ప్రక్కల గ్రామాల నుంచి మల్లయోధులు పాల్గొన్నారు. కుస్తీ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో వీడీసీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

దస్తురాబాద్ ఎస్ఐగా అశోక్

దస్తురాబాద్,మార్చి14 : దస్తురాబాద్ నూతన ఎస్ఐగా సీ అశోక్ బాధ్యతలు స్వీకరించారు. మండల ఎస్ఐగా విధులు నిర్వహించిన శంకర్ బదిలీపై నిర్మల్ వన్‌టౌన్‌కు వెళ్లారు. మండల ఎస్ఐ బాధ్యతలు స్వీకరించిన అశోక్ నిర్మల్ వన్ టౌన్ నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన ఎస్ఐ అశోక్‌ను దేవునిగూడెం బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు ఎండపెల్లి గంగన్న శాలువాతో సన్మానించారు. ఇక్కడ ట్రైనీ ఎస్ఐ కృష్ణారెడ్డి, సిబ్బంది ఉన్నారు.

ఉరివేసుకుని యువకుడి ఆత్మహత్య

గుడిహత్నూర్, మార్చి 14 : ఆదిలాబాద్ జిల్లా గుడిహత్నూర్‌లో గురువారం రాత్రి యువకుడు ఉప్పులేటి రవి (22) ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. రవి గత కొంతకాలంగా ఎలాంటి పని చేయకుండా జులాయిగా తిరుగుతూ మద్యానికి బానిసయ్యాడు. ఆ రోజు మద్యం తాగి ఇంటికి రావడంతో తండ్రి మందలించాడు. క్షణికావేశంతో మండల కేంద్రానికి అనుకొని ఉన్న వ్యవసాయ భూమిలోని చెట్టుకు ఉరి వేసుకున్నాడు. అటువైపు వెళ్తున్న వారు చెట్టుకు ఉరివేసుకుని ఉండడాన్ని గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి ఎస్ఐ మహేందర్ వెళ్లి పంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు తరలించారు. మృతుడి తండ్రి హన్మంతు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మహేందర్ తెలిపారు.

ప్రభాకర్‌రావు వర్ధంతి

ఖానాపూర్ టౌన్, మార్చి 14: స్వాతంత్ర్య సమరయోధుడు అనభేరి ప్రభాకర్‌రావు 77వ వర్ధంతిని నిర్మల్ జిల్లా ఖానాపూర్ విశ్రాంతి భవనంలో శుక్రవారం నిర్వహించారు. ఎల్లాపి సంఘం జిల్లా అధ్యక్షుడు పుప్పాల మురళి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో దొనికెని దయానంద్, అంకం రాజేందర్, నంది రామయ్య, గణపతి రావ్, నిమ్మల రమేశ్, కడార్ల గంగనర్సయ్య, రామరావ్ పాల్గొన్నారు.



ప్రభాకర్‌రావు చిత్రపటానికి పూలమాల వేస్తున్న జిల్లా అధ్యక్షుడు మురళి, నాయకులు